అని వక్త ఉపన్యాసం సాగిస్తే "నువ్వువదలడంతో మాకేం సంబంధం?... మేమే నిన్ను వదులుతాం! అని నోటితో చెప్పకుండాచేసి చూపెడతారు శ్రోతలు. అలాగే గాయకుడు విషయంలోకూడా. అందుచేత వక్తగాని, గాయకుడుగాని, (ఎంత ఘనమైన విషయాలు ఎంత రంజకంగా చెప్పినా, ఎంత మధురమైన రాగాలు ఎంత తియ్యగా పాడినా) సభలో ఉన్నవారి అభిప్రాయాను గుణంగా, అభిరుచులను తెలుసుకుంటూ, అందుబాటులో ఉండేటట్లు వ్యవహరిస్తే వారిని బాగా ఆకర్షించ గలుగుతారు గాని లేకపోతే ఆకర్షించలేరు. ముందు వారిని ఆకర్షించటం ముఖ్యం.

---

గల్పిక

# నడిచే మనిషి

"స్వైరవిహారి"

అతడు నడుస్తూన్నాడు - నడుస్తునే ఉన్నాడు.

కొండల్లో మొదలై - పాయలై-నదులై-సాగరంలో లీనమై తియ్యందనాలను కోలుపోయిన నదులై నడుస్తున్నాడు. అనుభవాల్లో అపజయాలకు బలియై-లోకపు వలలో సాలీడు దిక్కై - ఈగలా జీవితం బలియైతీరాలని - తీరుతుందని - మృత్యువునకు అర్థం మూడుముక్కలా యింతేనని-అతడు నడుస్తున్నాడు-నడుస్తూనే ఉన్నాడు.

నిరాశను నమిలిమింగిన కళ్ళలో కన్నీళ్ళను నెమరేస్తు - హృదయంలో రగిలే మంటల్లో-ఆశ(యా)లను ఆహుతిచేస్తూ-కన్నీళ్ళనే ఆజ్యంగా హృదయంలో "భగ్నజీవిత యజ్ఞాన్ని" నడుస్తూనే - చేస్తూచేస్తూనే-నడుస్తున్నాడు.

ఆశలు పేరాశలై - రూపంలేని ఊహల్లో సామ్రాజ్యాలై మానవ మహారాజ సామ్రాజ్యాలై గగనానికి లేచి-నేలపైకూలి-కృంగి కృశించి-తీగెలు తెగిన విపంచిగా-జీవిత ప్రయాసల నెమరేస్తూ-మజిలీమార్చి-దారితప్పించి-బిచ్చగాళ్లై ఆశ(యా)లు వెంట తరుముతున్నా-దారితప్పించి-అతడు నడుస్తున్నాడు-నడుస్తూనే ఉన్నాడు.

సాధన వెకిలిగా నవ్వింది! వేదన భగ్గున మండింది. ఆగేడు - ఆగిపోయాడు-హృదయంలో ఆగిపోయాడు-అతడు నడుస్తునే ఉన్నాడు! విచారంలో-ఆకలి సమాచారం గ్రహచారంగా-మెదడంతా చెదపురుగై కొరికేస్తూ - నలుదిక్కులా అపహాస్యాలకు నలిగి-చేసే ఉపవాసాలకు కలిగి-జీవితంలో-జీవనంలేని జీవితంలో - జీవితాన్ని - కొండచిలువగా నలిపేస్తున్నా - ఆపేస్తున్నా - కారే కన్నీళ్ళలో-పారే నదిలో పడవలా-అతడు నడుస్తున్నాడు-నడుస్తూనే ఉన్నాడు.

గోడమీది గడియారంలో ముల్లు గేలంగా సాగుతున్న సాగిపోతున్న జనసమూహపు తలలన్నీ వలలై తనదిక్కై తనకై పన్నిన వలలై మీదపడుతునట్టయి భ్రమలో సాగలేక-శ్రమాఫలితం జీవితాన్ని-యేమీ చెయ్యనూ తెలియక- తలపక్కకు తిప్పి- తిలకిస్తున్న వయ్యారి కనుసైగల భాషను తిలకిస్తూ-సముద్రపు ఘోషను-కనుసైగల భాషలో తిలకిస్తూ-దారి తప్పించలేక- మజిలీ మార్చలేక-ఆకలి సమాచారం-వాయిదాపడ్డకేసులా విస్మరించి-శ్రమాఫలితపు జీవితం జేబులో ఆశ(యా)ల వేళ్ళను సారించి-నిరాశగా-రాగిలేక విరాగియై-సైగలభాషా సముద్రఘోషాచెవులగిరిగురుమంటున్నా-ముసురుగా భాషముదిరి సముద్రఘోషగా పెరిగి-నలుదిక్కులా వ్యాపించినా-ముందు వెనుకల ఊగే బంతిలా-అతడు నడుస్తున్నాడు-నడుస్తూనే ఉన్నాడు.

ఆకలి అరిచింది! శత్రువుల దాడికి సూచనగా మ్రోగేసైరన్‌లా ఆకలి అరిచేస్తోంది! అలసిపోయిన ప్రయాసలో తలవంచిన నిర్వాసి-నిరాశల దాడిలో ఇంకోసారి పరాజితుడై — యెంగిలాకుల వేళ్లై-మానవ సౌభ్రాతృత్వ సామ్రాజ్యాల ఆశ(యా)ల మానవుడై-ధనవంతుల పెరటిగోడల యెగిరివచ్చే యెంగిలాకుల పెన్నిధికి-మానవుడై-కుక్కల్లో కుక్కై అతడు నడుస్తున్నాడు. ★